

ఎస్సారెస్పీపై పర్యాటకుల సందడి.. 2




ఘనంగా ఆదివాసీ దినోత్సవం.. 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

9-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## జగదాంబ మాత ఆశీస్సులతోనే ఎమ్మెల్యే అయ్యా..



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇందల్వాయి మండలం దేవి తండాలో ఆదివారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, బంజారా మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని వారిని ఉత్సాహపర్చారు. జగదాంబ మాత ఆశీస్సులు, ప్రజల ఆశీర్వాదం వల్లనే తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, నవీన్ గౌడ్, శ్రీనివాస్, నరేష్, అంబర్ సింగ్, హన్మండ్లు, దేవి తండా సర్పంచ్ గణేష్ పాల్గొన్నారు.

# భక్తితో బోనాలు..



ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో జిల్లావ్యాప్తంగా బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కొత్త దుస్తులు ధరించి బోనాలను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం ఊరేగింపుగా స్థానిక ఆలయాలకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని పోచమ్మగల్లీలోని నల్లపోచమ్మ ఆలయం, వర్నీరోడ్ రేణుకా ఎల్లమ్మ ఆలయం, దేవిరోడ్‌లోని నల్లపోచమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలోనూ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్







## శ్రీరాంసాగర్‌లో 40 టీఎంసీల నీరు..



**అక్షరటుడే, మెండోరా:** తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌లో ఎగువ నుంచి వరద వస్తోంది. మహారాష్ట్రతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టుకు వరద నీరు కొనసాగుతోంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో చేరుతోంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 13,465 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,078.80 అడుగుల వద్ద 40.907 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1,078.30 అడుగుల వద్ద 40.583 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కులు పోతుంది.

## ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఉన్నతస్థాయికి ఎదగాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆర్థికసాయం అందుకుంటున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. నగరంలోని అమ్మ వెంచర్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్కాలర్షిప్ పొందిన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మొత్తం 30 మంది ఉత్తమ విద్యార్థులకు రూ.13లక్షల మేరకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారి తమ ఉజ్వల జీవితాలను నాశనం చేసుకోవద్దని సీపీ హితవు పలికారు. క్రమశిక్షణతో కూడిన జీవితాలను విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకుని తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వంతో ముందుకు సాగాలని సూచించారు. ఫౌండర్ శివారెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నామన్నారు.







## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని, యువతను పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, అజ్మత్, మండల అధ్యక్షులు వెంకటేష్, రాజిరెడ్డి, మహేష్, సమరసింహా, రాము తదితరులు పాల్గొన్నారు

జిల్లాలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. గాంధారి మండలంలోని మారుమూల తండా నుంచి ఏకంగా హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రాలకు గాంజాను సరఫరా చేస్తున్నారు. యువకులు, మైనర్లతో గంజాయి రవాణా చేయిస్తూ కొందరు వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో యువతను టార్గెట్‌గా చేసుకొని గంజాయి వ్యాపారం చేస్తున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. దందా మాత్రం ఆగడం లేదు. ఈ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

- అక్షరటుడే, గాంధారి



# జోరుగా గంజాయి దందా

■ తండాల నుంచి హైదరాబాద్‌కు సరఫరా ■ రవాణా చేస్తున్న మైనర్లు ■ ఇటీవల ఇద్దరి అరెస్ట్

గాంధారి మండలంలోని నాగులూర్ తండాకు చెందిన ఇద్దరు గంజాయి తరలిస్తుండగా శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.402 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తండాకు చెందిన చెందిన మదర్ సింగ్ అదుపులోకి తీసుకొని విచారించినట్లు సమాచారం. మండలంలోని పలు తండాల నుంచి గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. గంజాయి సరఫరాలో ముఖ్యంగా యువకులను, మైనర్లను టార్గెట్గా ఎంచుకుంటున్నారు. వారిపై ఎక్కువ అనుమానం రాదని, డబ్బులు ఆశచూపి ఈ దందాలోకి లాగుతున్నారు.

### రాత్రిపూట..

అర్ధరాత్రి పూట గంజాయి రవాణా చేస్తున్నారు. రాత్రిపూట ఎక్కువగా పోలీసులు లేకపోవడం, రోడ్డంతా నిర్మానుష్యంగా ఉండడంతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. పోలీసులు రాత్రి సమయంలో చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తారు. అయితే ఎక్కువగా కార్లు, ఇతర భారీ వాహనాలను మాత్రమే ఆపుతున్నారు. దీంతో బైక్‌లపై గంజాయి తీసుకు వెళ్తున్నారు.

### అవగాహన కల్పిస్తున్నా..

గంజాయి, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల నివారణకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూనే.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా కూడా గంజాయి దందా ఆగడం లేదు. నెలలో దాదాపు ప్రతి గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఒకచోట అల్ప్రాజోలం పట్టుబడితే ఇంకోచోట గంజాయి దొరుకుతోంది. అవగాహన కల్పిస్తున్నా.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. అనంతరం బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలపై దృష్టి పెట్టాలని పోలీసులు సూచిస్తున్నారు.

## రోస్టర్ విధానాన్ని రద్దు చేసేంత వరకు పోరాడుతాం




**అక్షరటుడే, కామారెడ్డి :** ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక రోస్టర్ విధానాన్ని రద్దు చేసేంత వరకు మాలలు సంఘటితంగా పోరాడాలని మాలల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు పి. శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన ఎంసీఎఫ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోస్టర్ విధానం వల్ల మాలలకు ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనికి వ్యతిరేకంగా గ్రామ గ్రామాన ఉద్యమాన్ని చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా ధర్మపురిని ఎన్నుకున్నారు. బుల్లెట్, రమేష్, స్వామి, సుధాకర్, జగన్, నరసింహులు, రాజలింగం, దాసరి రాజులను జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. బండ శకుంతల, తిరుపతయ్య, బాబు, నరేందర్ ఉన్నారు.

## దేశాభివృద్ధిలో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దేశాభివృద్ధిలో యూత్‌కాంగ్రెస్ పాత్ర కీలకమని ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పేర్కొన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం, యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించినా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు కౌడప్ శరత్ కుమార్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగగా పార్టీ జెండాను కౌడప్ శరత్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువజన కాంగ్రెస్ పాత్ర చాలా కీలకమన్నారు. ఆరోజు స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేశారన్నారు. ఈరోజు దేశంలో బీజేపీ వ్యవహరిస్తున్న తీరును యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎండగట్టాలని సూచించారు. నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతు బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు గాంధీజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజారెడ్డి, విపుల్ గౌడ్, యాదగిరి, ప్రవీణ్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, సుధాకర్, ఖుద్దుస్, వాహీద్, ప్రమోద్, మోయిన్ యూనస్, సంతోష్, బలరాం, పోల ఉష, రవి, గంగారెడ్డి, రఘువీర్, అనుపాల్ పాల్గొన్నారు.



## ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే ఉండడం అదృష్టం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం నిజామాబాద్ యువత అదృష్టమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... ఇంత పెద్ద మొత్తంలో జాబ్ మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు. రాజకీయంతో పాటు ప్రజల అభివృద్ధికి పాటుపడే వారు అరుదుగా ఉంటారన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉద్యోగాలు రానివాళ్లు నిరాశ చెందకుండా మరింత ప్రయత్నించాలన్నారు. ప్రస్తుత ప్రయత్నాన్ని అనుభవంగా పొంది భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఇందూరు యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉందని వారి ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇందూరు భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు.



యువతకు సరైన వేదిక దొరకడం లేదని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని 70కి పైగా కంపెనీలను ఒకే వేదిక పైకి తీసుకోవచ్చామని తెలిపారు. నిజామాబాద్ ను ఐటీ హబ్‌గా మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల ఐటీ శాఖామంత్రి శ్రీధర్ బాబును కలిసి పలు ప్రతిపాదనలు అందించినట్లు తెలిపారు.

## సేవా కార్యక్రమాల్లో ముందుంటాం



**అక్షరటుడే, కామారెడ్డి:** సేవాదళ్ ద్వారా సేవా కార్యక్రమాల్లో ముందుంటామని జిల్లా అధ్యక్షుడు గడ్డమీది మహేష్ అన్నారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలో నూతన మండల అధ్యక్షులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి సూచనతో జిల్లాలో నియోజకవర్గాలు, మండలాల అధ్యక్షులను నియమించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు మెహెర్ బాబాగౌడ్, ఒడ్డె సుదర్శన్, ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్ చారి, ప్రవీణ్ కుమార్ గౌడ్, మాధవ రెడ్డి, వడ్ల హరీష్, మహేష్ పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఆదివారం 'ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ' ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే ఆలయ కమ్యూనిటీ హాల్ ఆవరణను శుభ్రం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబల్ల తిరుపతి, సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలు ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పద్మశాలీలు ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని నిజామాబాద్ నగర పద్మశాలి సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కన్న దుబ్బరాజం సూచించారు. ఆదివారం నగరంలోని జిల్లా పద్మశాలి సంఘ భవనంలో పద్మశాలి సంఘం 11వ తర్ప సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కన్న దుబ్బరాజం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పద్మశాలీలు రాజకీయ తదితర అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం 11వ తర్ప సంఘం నూతన కార్యవర్గానికి నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా భీమర్తి సురేందర్ ఐదవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కస్తూరి శ్రీనివాస్, కోశాధికారిగా సామల అశోక్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కస్తూరి శంకర్, ఇంజమూరి లక్ష్మీ నారాయణ, జంజారి నర్సింలు, సహాయ కార్యదర్శులుగా చింత తిరుపతి, పలాస మల్లికార్జున్, దూస రవి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కైరంకొండ చంద్రమౌళి, ప్రచార కార్యదర్శిగా సామల రవి, కార్యవర్గ సభ్యులుగా సామల సాయిప్రసాద్, తాటిపాముల ప్రవీణ్, సలహాదారులుగా బండి మధు, పడాల గంగాధర్, భీమర్తి రవి, సామల బాల్ కిషన్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నగర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి ఎనగందుల సుభాష్, ప్రచార కార్యదర్శి బూస రవి తదితరులు పాల్గొన్నారు.



వరుసగా మూడు రోజుల పాటు సెలవులు కలిసిరావడంతో పోచంపాడ్ ప్రాజెక్ట్‌పై సందడి నెలకొంది. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం పర్యాటకులు ప్రాజెక్టుకు తరలివచ్చారు.
- అక్షరటుడే, మెండోరా

# ఎస్సారెస్పీపై పర్యాటకుల సందడి..


■ ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ■ గుర్రపు స్వారీతో ఎంజాయ్ చేసిన చిన్నారులు ■ గట్టి భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు

శ్రీరాంసాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. డ్యామ్‌పై నుంచి వీస్తున్న చల్లని గాలులు, కళకళలాడుతున్న జలాశయ అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులు డ్యామ్‌పై సేదతీరుతూ ప్రకృతి రమణీయతను తిలకించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ప్రాంగణంలో అందుబాటులో ఉన్న గుర్రపు సవారీలు చిన్నారులను అమితంగా అలరించాయి.



### పోలీసుల బందోబస్తు..

సెలవుల కారణంగా భారీగా పర్యాటకులు తరలిరావడంతో ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. డ్యామ్ దిగువ భాగం, ప్రమాదకర ప్రాంతాల వైపు పర్యాటకులు వెళ్లకుండా మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అధికారులు పదేపదే సూచిస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు.



## తల్లిదండ్రులపై ప్రేమతో విగ్రహాల ఆవిష్కరణ

**అక్షరటుడే, కామారెడ్డి:** తల్లిదండ్రులు చనిపోగానే కొద్ది రోజుల్లోనే వారి జ్ఞాపకాలను మర్చిపోయి రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యే పిల్లలున్న ఈ రోజుల్లో.. తల్లిదండ్రులపై ఉన్న ప్రేమ, గౌరవానికి నిదర్శనంగా ఓ కొడుకు, కూతురు వారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పాలరాతి విగ్రహాలు చేయించి ఆవిష్కరించారు. రామారెడ్డి మండలం పోసానిపేట శివారులోని చాట్ల వ్యవసాయ క్షేత్రంలో చాట్ల నర్సయ్య, గంగమణి దంపతుల పాలరాతి విగ్రహాలను వారి కుమారుడు, కుమార్తె ఆదివారం ఆవిష్కరించారు. కుటుంబ సభ్యులు భావోద్వేగ వాతావరణంలో విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి, నర్సయ్య జ్ఞాపకార్థం సంస్మరణ సంచికను సైతం విడుదల చేశారు. చాట్ల విజయకృష్ణ, చాట్ల విద్యుల్లత మాట్లాడుతూ.. తమ తండ్రి జీవితాంతం కళాకారులు, రచయితలు, కవుల కోసం సేవ చేశారని గుర్తు చేశారు. ఆయన రచనలు, సేవలను తెలంగాణ వ్యాప్తంగా తీసు కెళ్లేందుకు వ్యాస సంకలనం, కామారెడ్డి కవుల చరిత్ర పుస్తకాలను ప్రచురిస్తామన్నారు. యువత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, వారికి సేవ చేయాలని సూచించారు. నర్సయ్య స్మారకార్థం చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి భవిష్యత్‌లో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రంజిత్ మోహన్, నిర్వాహకుడు చాట్ల ప్రణీత్, మాజీ కౌన్సిలర్ వంశీకృష్ణ, దినేష్ రెడ్డితో పాటు పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

## పోచంపాడ్ పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



**అక్షరటుడే, మెండోరా :** మండలంలోని పోచంపాడ్ గ్రామంలో కొలువైన పోచమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆషాఢ చివరి ఆదివారం కావడంతో భక్తులు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకపోకలతో పోచంపాడ్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకుని సామూహికంగా భోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. మండలంలోని ఇతర ఆలయాల్లో సైతం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.



నిజామాబాద్ లో..



తెలంగాణ యూనివర్సిటీలో..

## ఘనంగా ఆదివాసీ దినోత్సవం..

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఉమ్మడిజిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొమురంభీం విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదివాసీలే నిజమైన ప్రకృతి రక్షకులని పేర్కొన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ఆలూర్‌లో..



ముప్కాల్ మండల కేంద్రంలో..



బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో..

## చదువుపై విరక్తితో విద్యార్థి బలవన్మరణం



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎంత చదివినా బుర్రకెక్కడం లేదని.. చదువులో వెనుకంజలో ఉంటుండడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పాల్వంచ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన దొరబోయిన జశ్వంత్ (15) గ్రామంలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే ఎంత చదివినా అతనికి చదువు అబ్బడం లేదని ఎప్పుడూ బాధపడుతూ ఉండేవాడు. ఈ విషయంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలి గదిలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## పాత కక్షలతో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

**అక్షరటుడే, కామారెడ్డి:** గతేడాది జరిగిన గొడవలు మనసులో పెట్టుకుని ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటన దమ్మాయిగూడ శ్రీచైతన్య పాఠశాలలో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని స్నేహపురి కాలనీకి చెందిన అభిషేక్ దమ్మాయిగూడ శ్రీచైతన్య పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. అయితే శనివారం రోజు అభిషేక్ మెట్లపై నుంచి పడ్డాడని హాస్టల్ నుంచి ఫోన్ రావడంతో తల్లిదండ్రులు దమ్మాయిగూడ వెళ్లారు. అక్కడికి వెళ్లి చూడగా మెట్లపై నుంచి పడినట్టుగా లేవని, అనుమానం ఉందని, సీసీ ఫుటేజ్ చూపించాలని వార్డెన్‌ను అడగగా సీసీ ఫుటేజీ లేదు.. ఏదైనా చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని బాధితులు తెలిపారు. దాంతో అభిషేక్‌ను కామారెడ్డికి తీసుకువచ్చి చికిత్స చేయిస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ.. గత సంవత్సరం రూంలో జరిగిన చిన్నచిన్న గొడవలు మనసులో పెట్టుకుని శుక్రవారం రాత్రి 1 గంటల నుంచి 3 గంటల వరకు సుమారు 12 మంది తోటి విద్యార్థులు తనపై కర్రలు, ప్లేట్లు, చీపురు కట్టలతో పలుమార్లు దాడి చేశారని తెలిపాడు. ఈ విషయం పేరెంట్స్ తో చెప్తే మళ్ళీ ఇక్కడికి వచ్చాక సంగతి చూస్తామని బెదిరించారని పేర్కొన్నాడు. తమ కొడుకుపై విచక్షణ రహితంగా దాడి చేసిన తోటి విద్యార్థులు, ఘటన జరిగినప్పటికీ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తండ్రి కోరాడు.

## ఆనంద్ నగర్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలకు శ్రీకారం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని వర్ని రోడ్ ఆనంద్ నగర్ వెల్ఫేర్ సొసైటీకి ఎన్నికల ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. గత పాలకవర్గం గడువు ముగియడంతో కాలనీ వాసులంతా కమిటీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎన్నికల కమిటీ సభ్యులు అబ్బాపూర్ రవీందర్, నవీన్ కుమార్ ముదిరాజ్, వి.రవి, భీమ్‌రాజ్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడిగా సిరికొండ నర్సయ్య, అధ్యక్షుడిగా మల్లేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారంరోజుల్లోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. కార్యక్రమంలో ఆనంద్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.